క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న వార్డు కౌన్సిలర్, గ్రామస్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని తవిసికొండ గ్రామంలో గుర్రప్పస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమి పూజ చేశారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి, మండల కన్వీనర్ తిరుమలేశ్వర రెడ్డి హాజరై భూమి పూజ చేశారు.

వ్యక్తి ఆత్మహత్య



ఉసేన్‌వలి మృతదేహం

కోవెలకుంట్ల: పట్టణంలోని సంతపేటకు చెందిన ఓ వ్యక్తి బుధవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సమాచారం మేరకు.. కాలనీకి చెందిన ఉసేన్‌వలి(40) తాపీ మేస్త్రిగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతునికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: డోన్, బేతంచెర్ల నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా కొచ్చెర్వు సబ్ స్టేషన్‌కు వెళ్లే 33 కేవీ లైన్ షిఫ్టింగ్ పనులు చేస్తున్నారు. దీని కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు తెల్లవారుజామున 3 గంటల నుంచి ఉదయం 10 గంటల వరకు.. మళ్లీ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు సరఫరా చేస్తామని తెలిపారు.

నేడు ప్యాపిలిలో 4 గంటలు నిలిపివేత

ప్యాపిలి: పట్టణంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వినయ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్యాపిలి టౌన్ ఫీడర్‌లో 11కేవీ కొత్త లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కార్మిక చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది ఆజాం హుస్సేన్

బనగానపల్లెరూరల్: కార్మిక చట్టాలు, సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ న్యాయవాది ఆజాం హుస్సేన్ అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక సివిల్ సప్లైస్ గోడౌన్‌లో పనిచేసే హమాలీలకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో కార్మిక చట్టాలు, భద్రత, కనీస వేతనాలు, వ్యక్తిగత బీమా వంటి వాటిపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సీనియర్ న్యాయవాది ఆజాంహుస్సేన్ మాట్లాడుతూ.. కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని.. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్యానెల్ అడ్వకేట్స్ ఎస్ఎండీ అల్లావుద్దీన్, ముజాహిద్ హుస్సేన్, న్యాయవాదులు నరసింహారెడ్డి, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయం పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

డోన్ టౌన్: స్థానిక ప్రభుత ఐటీఐలో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయాన్ని కర్నూలు సెంట్రల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రియదర్శని, డోన్ ఎంఈఓ ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. ఈ విద్యాసంవత్సరం (2025–26)లో ప్రవేశాల కోసం ఉన్న అవకాశాలను పరిశీలించడానికి పర్యటించినట్లు ఎంఈఓ తెలిపారు. తరగతుల నిర్వాహణకు అవసరమైన బెంచీలు, గ్రీన్ బోర్డులను పరిశీలించారు. త్వరలో నంద్యాల కలెక్టర్ పర్యటిస్తారని.. ఆ తర్వాత ప్రవేశాల కోసం నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉండవచ్చని పేర్కొన్నారు.

షాదీఖానాలకు గ్రహణం

- మైనారిటీల సంక్షేమం పట్టని కూటమి ప్రభుత్వం
- షాదీఖానాల నిర్మాణ పనులపై దృష్టిసారించని సర్కార్
- మొండిగోడలకే పరిమితమైన రాచర్ల షాదీఖానా
- వైఎస్సార్‌సీపీ హయాంలో జలదుర్గంలో షాదీఖానా నిర్మాణం పూర్తి



గత వైఎస్సార్‌సీపీ హయాంలో జలదుర్గంలో రూ. కోటితో నిర్మించిన షాదీఖానా



రాచర్లలో నిలిచిపోయిన షాదీఖానా నిర్మాణం

ప్యాపిలి: మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఊదరగొడుతున్న కూటమి ప్రభుత్వ పెద్దలు చేతల్లో మాత్రం రిక్తహస్తాన్నే చూపెడుతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వ పాలనలో తమ రాతలు మారుతాయని భావించిన ముస్లింలకు తీవ్ర నిరాశే మిగులుతోంది. ప్యాపిలి మండలం రాచర్ల, జలదుర్గం గ్రామాల్లో ముస్లింల సంఖ్య అధికంగా ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండు గ్రామాల్లో షాదీఖానా నిర్మాణాలకు రూ. 1.6 లక్షల చొప్పున మంజూరు చేసింది. మైనారిటీల సంక్షేమంపై తనకున్న చిత్తశుద్ధిని అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేతల్లో చేసి చూపారు. అయితే ఆ నిధులతో షాదీఖానాలను గోడల వరకు నిర్మించారు. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు షాదీఖానాల నిర్మాణాల గురించి పట్టించుకోలేదు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి ముస్లిం మైనారిటీలకు ఒక భరోసా లభించింది. పెండింగ్‌లో ఉన్న షాదీఖానాల నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవసరమైన మేర నిధులను కేటాయించింది.

రూ. కోటితో జలదుర్గం షాదీఖానా భవన నిర్మాణం

డోన్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన అప్పటి ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి డోన్ నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. గతంలో అర్థాంతరంగా ఆగిపోయిన అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. జలదుర్గం, రాచర్ల గ్రామాల్లో 2004 నుంచి షాదీఖానా భవన నిర్మాణాలు మొండిగోడలకే పరమితమయ్యాయని తెలుసుకున్నారు. తొలివిడతలో ఆయన జలదుర్గం షాదీఖానా కోసం రూ. కోటి నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో శరవేగంగా షాదీఖానా భవన నిర్మాణాలు పూర్తి చేసి 2024 ఫిబ్రవరి 17న షాదీఖానాను మంత్రి హోదాలో బుగ్గన ప్రారంభించారు.

మొండిగోడలకే పరిమితం

రాచర్లలో షాదీఖానా మొండిగోడలతోనే దర్శనమిస్తోంది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో షాదీఖానా గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. గ్రామంలో చిన్న శుభకార్యం చేసినా ఇళ్ల వద్దే చేసుకోవాల్సి వస్తోందని గ్రామానికి చెందిన ముస్లిం పెద్దలు వాపోతున్నారు. అసౌకర్యాల మధ్యే వివాహాలు, ఇతర శుభకార్యాలు చేసుకుంటున్నామని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి షాదీఖానా నిర్మాణం పూర్తి చేయాలని రాచర్ల ముస్లింలు కోరుతున్నారు.

రాచర్ల షాదీఖానాను పూర్తి చేయాలి



2004లో రాచర్ల గ్రామంలో షాదీఖానా నిర్మాణ పనులు జరుగుతుంటే సంతోషించాం. అయితే అప్పట్లో గోడల వరకు నిర్మించి వదిలేశారు. అప్పటి నుంచి షాదీఖానా నిర్మాణ పనులు ఎప్పుడు మొదలవుతాయా అని ఎదురు చూస్తున్నాం. ఇళ్ల వద్దే శుభకార్యాలు చేసుకుంటున్నాం. ఇళ్ల వద్ద కనీస సౌకర్యాలు లేక శుభకార్యాలకు వచ్చిన బంధువులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం స్పందించి షాదీఖానా నిర్మాణ పనులు మొదలుపెట్టాలి.

–షేక్ హుసన్ వలి, రాచర్ల

శుభకార్యాలకు ఇబ్బందులు పడుతున్నాం



రాచర్లతో పాటు పరిసర గ్రామాల్లో ముస్లింలు అధిక సంఖ్యలో నివసిస్తున్నారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు చేసుకునేందుకు గ్రామాల్లో ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లు కూడా ఉండవు. షాదీఖానా నిర్మాణం పూర్తి చేస్తే సౌకర్యంగా ఉంటుంది. ముస్లింల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం షాదీఖానా నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

–షేక్ షరీఫ్, రాచర్ల

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు జరుపుకోవాలంటే పెద్ద ఎత్తున బంధు మిత్రులు వస్తారు. ఇళ్ల వద్ద వారికి వసతి కల్పించడం ఇబ్బందికరంగా ఉంటుంది. షాదీఖానాల్లో అయితే శుభకార్యాలు అక్కడే రెండు, మూడు రోజులు జరుపుకోవచ్చు. రాచర్ల షాదీఖానా నిర్మాణం దాదాపు 20 ఏళ్లుగా మొండిగోడలతోనే నిలిచిపోయింది. ప్రభుత్వం స్పందించి ఈ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి.

–రసూల్, ఆవాజ్ కమిటీ అధ్యక్షుడు, డోన్ నియోజకవర్గం

బ్రహ్మంగారి ఆరాధనోత్సవాలు ప్రారంభం



నేలమఠంలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న అర్చకులు

బనగానపల్లె: వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని గరిమిరెడ్డి అచ్చమ్మ మఠం, వీరబ్రహ్మేంద్రస్వామి నేలమఠం, రవ్వలకొండపై వెలసిన వీరప్పయ్యస్వామి ఆలయాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. రవ్వలకొండపై ఉన్న కాలజ్ఞాన గుహలను సందర్శించారు. వైశాఖ శుద్ధ దశమి రోజున వీరబ్రహ్మేంద్ర స్వామి సజీవ సమాధి అయినందున పవిత్రమైన రోజుగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. గరిమిరెడ్డి అచ్చమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం స్వామివారి 332వ జీవసమాధి జ్ఞాపిక జెండాను ఊరేగింపుగా జుర్రేరు గట్టున వెలసిన బ్రహ్మంగారి ప్రథమ పీఠమైన బ్రహ్మంగారి నేల మఠం వద్దకు తీసుకొచ్చి ధ్వజ స్తంభానికి ఎగురవేశారు. సాయంత్రం పల్లకి సేవ నిర్వహించారు.

సంజీవయ్యకు నివాళి

బనగానపల్లె రూరల్: దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దస్తగిరి మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాకు చెందిన దామోదర సంజీవయ్య ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో దళితులతో పాటు అన్ని వర్గాల పేదల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేశారని కొనియాడారు.

భారతదేశ సంస్కృతి గొప్పది



ఆధ్యాత్మిక ప్రసంగం ఇస్తున్న హంపీ పీఠాధిపతి

కోవెలకుంట్ల: భారతదేశ సంస్కృతి, సాంప్రదాయాలు చాలా గొప్పవని.. ఇతర దేశాలు సైతం మన ఆచారాలను కొనసాగిస్తున్నాయని హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్యభారతి తీర్థ మహాస్వామి అన్నారు. పట్టణంలో వెలసిన వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయ కుంభాభిషేక వర్షోత్సవాలకు బుధవారం రాత్రి పీఠాధిపతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం భక్తులను ఆకట్టుకుంది. అరబ్ దేశమైన దుబాయ్‌లో 24 ఎకరాల్లో హిందూ దేవాలయాలు నిర్మించి భారతదేశ సంస్కృతిని కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. దేశ సంస్కృతిని రక్షిస్తేనే హిందూ ధర్మం నిలబడుతుందన్నారు. మనం చేసే పూజ ద్వారా 25 శాతం పుణ్యాన్ని పొందుతామని, సంస్కృతి రక్షణ ద్వారా మరో 25శాతం, సామాజిక సేవ ద్వారా మిగిలిన పుణ్యం లభిస్తుందని తెలిపారు. మన కుటుంబాలను, చుట్టుపక్కల వారిని, అట్టడుగు వర్గాల ప్రజలను ప్రేమించడం ద్వారా ఆశీర్వాదాలు, సానుకూల కర్మను పొందుతామన్నారు. అంతకు ముందు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణకుంభంతో పీఠాధిపతికి ఘన స్వాగతం పలికారు.

పోటాపోటీగా బండలాగుడు



బండ లాగుతున్న వృషభాలు

డోన్ రూరల్: మండల పరిధిలోని చింతలపేట గ్రామంలో బుధవారం వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. నాలుగు పళ్ల విభాగంలో జరిగిన ఈ పోటీల్లో అనంతపురం జిల్లా ఎస్. కొత్తూరు గ్రామానికి చెందిన బీఎస్ఎస్ రెడ్డి వృషభాలు అత్యధిక దూరం బండ లాగి విజేతలుగా నిలిచాయి. ప్రైస్ మనీగా రూ.30వేలను కైవసం చేసుకున్నాయి. తరువాత స్థానాల్లో నంద్యాల జిల్లా గడివేముల సంజయ్‌కుమార్ రూ.20 వేలు, రాయచూరుకు చెందిన అభిషేక్ రూ.10వేలు, నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన మేకల భానుజ రూ.5 వేలు, నంద్యాల జిల్లా ముక్కమల గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి రూ.3 వేలను సొంతం చేసుకున్నారు.

వంతెన గోడను ఢీకొని టిప్పర్ బోల్తా



వంతెన కింద పడిన టిప్పర్



చికిత్స పొందుతున్న డ్రైవర్ మధు

బనగానపల్లె రూరల్: నందవరం సమీపంలో టిప్పర్ బ్రిడ్జి నుంచి కింద బోల్తాపడింది. స్థానికుల వివరాల మేరకు.. బుధవారం సాయంత్రం నంద్యాల నుంచి బనగానపల్లె వైపు వస్తున్న టిప్పర్ నందవరం–పండ్లాపురం గ్రామాల మధ్యలో ఉన్న ఓ వంతెనను ఢీకొట్టింది. అదుపు తప్పి వంతెన కింద బోల్తా పడింది. డ్రైవర్ మధుకు స్వల్ప గాయాలయ్యాయి. అతన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాదం సమయంలో టిప్పర్‌కు ఎదురుగా ఎలాంటి వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం

- టీడీపీ నేత రమణపై వైఎస్సార్‌సీపీ నాయకుల మండిపాటు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్మికులు

బేతంచెర్ల: డోన్ నియోజకవర్గ అభివృద్ధితో పాటు మూతబడిన పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని తెరిచి కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపిన మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిపై టీడీపీ నాయకుడు మర్రి రమణ మతి భ్రమించి మాట్లాడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మురళీకృష్ణ, నాయకులు యాకోబ్, పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు అన్నారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ, మండల కన్వీనర్లు జాకీర్, తిరుమలేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 2018లో మూతబడిన పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బుగ్గన చొరవతోనే ఎన్సీఎల్టీ వాళ్లు దీన్ని స్క్రాప్ కింద అమ్మాలనుకున్నప్పుడు కొత్త యజమాన్యాన్ని తీసుకొచ్చి ఫ్యాక్టరీ పునః ప్రారంభానికి కృషి చేశారన్నారు. ప్రత్యక్షంగా 500 మందికి పరోక్షంగా 5 వేల మందికి ఉపాధి కల్పించారని తెలిపారు. అలాంటి గొప్ప వ్యక్తిపై లేనిపోని ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మర్రి రమణ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అసత్య ఆరోపణలు చేయడం భావ్యం కాదన్నారు. చేతనైతే కార్మికులకు సకాలంలో వేతనాలు వచ్చేలా చూడాలని హితవుపలికారు. అధికారంలో లేనప్పుడు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తరువాత మరో మాట మాట్లాడుతూ మాజీ మంత్రి బుగ్గనపై విమర్శలు చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. నాయకులు గూని నాగరాజు, వెంకటేశ్వర్లు, వలీబాషా, అల్తాఫ్, యోబ్, ఎద్దులన్న పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి సీహెచ్‌ఓల వినతిపత్రం



మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సీహెచ్‌ఓలు

బనగానపల్లె రూరల్: ఆయుష్మాన్ భారత్ కింద విధులు నిర్వహించే సీహెచ్‌ఓలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ చేపట్టిన సమ్మె 10వ రోజుకు చేరుకుంది. బుధవారం ఏపీ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ గురుప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. సంఘం జిల్లా కోఆర్డినేటర్ సురేష్‌బాబు, సభ్యులు వినోద్‌కుమార్, హరిక పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలతో ఎన్నో ప్రయోజనాలు



వర్మీ కంపోస్టును చూపుతున్న అధికారులు

కోవెలకుంట్ల: గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలతో అనేక ప్రయోజనాలు చేకూరుతాయని అవుకు, కొలిమిగుండ్ల ఎంపీడీఓలు వెంగన్న, ప్రసాదరెడ్డి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో బుధవారం ఆయా మండలాల్లోని పంచాయతీ కార్యదర్శులు, క్యాప్, షెడ్‌మిత్రలకు కోవెలకుంట్ల ఎంపీడీఓ వరప్రసాదరావు అధ్యక్షతన చెత్త సంపద కేంద్రాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇంటి, నీటి పన్నులు, వివిధ అభివృద్ధి పనుల నిర్వహణతో గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తోందన్నారు. వీటితో పాటు గ్రామ పంచాయతీ పరిధిలో సేకరించే తడి, పొడి వ్యర్థాలను వేరు చేసి వర్మీకంపోస్టుగా మార్చి విక్రయాలు జరిపితే గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తుందన్నారు. అనంతరం వర్మీ కంపోస్టు తయారీని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా మండలాల అధికారులు శ్రీనివాసులు, శివప్రసాద్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

డోన్ రూరల్: మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ నాయకులు అబ్బాస్, అన్వర్ తదితరులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఇంజినీరింగ్ కార్మికులకు పెట్రోల్ అలవెన్స్, సేఫ్టీ ప్రికాషన్స్ బూట్లు, గ్లౌజులు, కటింగ్ ప్లేయర్స్ వంటి ఇవ్వాలన్నారు. అలాగే కనీస వేతనం రూ.35 వేలు చేయాలన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యం



వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని.. ఆ దిశగా ప్రతి నాయకుడు, కార్యకర్త పనిచేయాలని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడి అన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని సమస్యలపై ఆరా తీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాల అమలు తీరుపై చర్చించారు. ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, అధైర్య పడవద్దని సూచించారు. ప్రజా సమస్యలపై, ప్రజల పక్షాన పోరాడేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి, వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ మాజీ డైరక్టర్ ముర్తుజావలి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మురళీ కృష్ణ, నాయకులు బుగ్గన చంద్రారెడ్డి, గూని నాగరాజు, ఇబ్రహీం, మనోహర్ నాయుడు, మురళీ, కుమార్ రెడ్డి, సలీం, సర్పంచ్ తిమ్మయ్య, పట్టణ, మండల కన్వీనర్లు తిరుమలేశ్వర్‌రెడ్డి, జాకీర్ పాల్గొన్నారు.

‘కుట్టు మిషన్‌ల పేరుతో దోపిడీ’



డీఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కొలిమిగుండ్ల: బీసీ మహిళలకు కుట్టు మిషన్‌ల పేరుతో కూటమి ప్రభుత్వం దోపిడీకి గురి చేస్తోందని వైఎస్సార్‌సీపీ బనగానపల్లె నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బీవీ జగన్ ఆరోపించారు. బుధవారం కొలిమిగుండ్ల, అవుకు మండలాల బీసీ సెల్ అధ్యక్షులు బాలకంబయ్య, పురుషోత్తంతో కలిసి నంద్యాల డీఆర్వో రాము నాయక్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ మహిళలకు కుట్టు మిషన్‌ల ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం అంటోందని.. అయితే ఇందులో పెద్ద ఎత్తున దోపిడీ జరుగుతోందన్నారు. ఒక్కో మహిళకు కుట్టుమిషన్‌కు రూ.4300, ట్రైనింగ్ కోసం రూ.3వేలు చొప్పున రూ.7300 మాత్రమే ఖర్చు చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి రూ.73 కోట్ల ఖర్చు కాగా రూ. 230 కోట్లకు టెండర్ వేశారని ఆరోపించారు. మిగిలిన రూ. 150 కోట్లు పక్కదారి పడుతుందని ఆరోపించారు. వీటిపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. బీసీలపై కూటమి ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందన్నారు. 45 ఏళ్లకే పింఛన్ ఇస్తామని మాట ఇచ్చి అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారన్నారు.

వాసవీమాత జయంతి వేడుకలు



కోవెలకుంట్ల: గంధంతో తయారు చేసిన సీతారాముల విగ్రహాలు



డోన్‌లో గ్రామోత్సవం



బనగానపల్లె: అమ్మవారి సేవలో ఆర్యవైశ్య సంఘం నాయకులు

వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి జయంతి వేడుకలను బుధవారం డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లోని అమ్మవారి ఆలయాలు, అమ్మవారిశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆర్యవైశ్యులు 108 కలశాలతో ఊరేగింపుగా ఆలయాలకు వెళ్లి అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం అర్చనలు, ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. రుద్ర, చండీ, నవగ్రహ, సుదర్శన హోమాలను నిర్వహించారు. ఆర్యవైశ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం డోలు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్



బేతంచెర్లలో సామూహిక పూజలు